క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూసెంటర్: భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. నేటి నుంచి 16వ తేదీ వరకు అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున తప్పక జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ సమస్యలపై వెంటనే ఫోన్ నంబర్ 87124 81550లో సంప్రదించాలన్నారు. విద్యుత్ సమస్యలుంటే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

నెహ్రూసెంటర్: యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం బుధవారం పట్టణంలో నిర్వహించారు. యూరియా నేరుగా రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కట్టయ్య, రాములు, రంగయ్య, పాపయ్య పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



మహబూబాబాద్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం వంద రోజుల ప్రణాళికలో భాగంగా 34వ వార్డులో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, ఏఈ కుమార్, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

కొత్తగూడ: అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ వజరహత్ తెలిపారు. మండలంలోని రేన్య తండాకు చెందిన ఒక వ్యక్తి అడవి పందిని వేటాడి మాంసం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మాంసంతో సహా ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఫారెస్ట్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విజయవంతం చేయాలి

గూడూరు: ఇండియా చైనాల మధ్య 1962లో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన 120 మంది యాదవ వీరులకు గుర్తింపుగా కొనసాగుతున్న రేజాంగ్ల రజ్ కలశ యాత్ర గురువారం సాయంత్రం గూడూరుకు చేరుకుంటుందని, యాత్రను విజయవంతం చేయాలని యాదవ సంఘం జిల్లా నాయకుడు పెదకాసు కుమారస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నూకల సురేందర్‌యాదవ్, మేకల రవీందర్‌యాదవ్, బత్తుల లక్ష్మణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక చెల్లదు

తొర్రూరు: ఏకపక్షంగా ఎన్నుకున్న జామా మసీద్ కమిటీ ఎన్నిక చెల్లదని కమిటీ నాయకులు సయ్యద్ హుస్సేన్, మహమ్మద్ సాబీర్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని మసీద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మసీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ అలీమ్ పదవి కాలం పూర్తయిన కొన్ని సంవత్సరాలుగా తనే అధ్యక్షుడిగా చెలామని అవుతున్నాడని ఆరోపించారు. మెజార్టీ కమిటీ సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండానే ఎన్నికైనట్లు ప్రకటించుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు అంజుమ్, రహమాన్, యాకుబ్‌పాషా, చాంద్ పాషా, సుభాని, కాజా, సమీర్, వహీద్, అబ్దుల్ హక్ పాల్గొన్నారు.

గ్రామదేవతల ఒడిలోనే ప్రజలు సురక్షితం

దంతాలపల్లి: గ్రామ దేవతల ఒడిలోనే ప్రజలు సురక్షితంగా ఉంటారని ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బోనాల పండుగా సందర్భంగా ముత్యాలమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేతనాలు పెంచాలి

బయ్యారం: రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మండా రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జగ్గుతండా బుడగజంగాల కాలనీలో కార్మికులతో మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు రోజువారీ వేతనం రూ.800 ఇవ్వాలన్నారు.

తిరునక్షత్రోత్సవం

మహబూబాబాద్ రూరల్: శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్దజీయర్ స్వామివారి తిరునక్షత్రోత్సవం (జన్మదినోత్సవం) పూజావేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో అర్చకుడు సత్యం గౌతంశర్మ పూజలు చేశారు.

వేతన వెతలు

- గిరిజన హాస్టల్, ఆశ్రమ పాఠశాల కార్మికులకు 8నెలలుగా అందని వేతనాలు
- ఉద్యోగ భద్రత లేదని ఆవేదన



ఆశ్రమ పాఠశాలలో వంట చేస్తున్న పార్ట్‌టైం కార్మికులు

మహబూబాబాద్ అర్బన్: గిరిజన హాస్టల్స్, గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంట, పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులు ఎంతో కీలకం. వారు ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వివిధ సేవలందిస్తూ వంట పనులు, పాఠశాల ఆవరణం, తరగతులు, హాస్టల్ గదులు శుభ్రం, పారిశుద్ధ్య పనుల్లో పని చేస్తూ ఏళ్లు గడుస్తున్నా వారి బతుకుల్లో మార్పు రావడం లేదు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.13,600, దినసరి, పార్ట్‌టైం రూ.11,700జీతం వస్తుంది. ఏళ్లుగా పని చేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత లేదని, 8నెలలుగా, జీతాలు లేవు. కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగ భద్రత కరువు..

జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలు 19 ఉన్నాయి. ఇందులో సుమారు 175 మంది విధులు నిర్వహిస్తున్నారు. గిరిజన వసతి, కళాశాల హాస్టల్స్ మొత్తం జిల్లా వ్యాప్తంగా 15 ఉన్నాయి. ఇందులో ఔట్ సోర్సింగ్‌లో 22మంది, రెండు కలుపుకొని హాస్టల్స్‌లో దినసరి పార్ట్‌టైం, వంట, పారిశుద్ధ్య వివిధ కార్మికులు మొత్తం 197మంది పనిచేస్తున్నారు. వీరంతా జాబ్‌చార్ట్‌కు సంబంధం లేకుండా ఆశ్రమ పాఠశాలలో ఏ పనైనా చేస్తారు. హాస్టల్‌లో వంట చేయడం, పరిశుభ్రత, వడ్డించడంతోపాటు అన్ని పనులు చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో వారితోపాటు సమానంగా పనిచేస్తారు. జనవరి నుంచి, ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వేతనాలు లేవు. కార్మికుల శ్రమకు తగినట్లుగా వేతనం మాత్రం అందడం లేదు.ఐటీడీఏలో పనిచేస్తున్న కార్మికులందరికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల స్కూల్ ఫీజులు, బుక్‌లు, ఇంట్లో సరుకులకు కుటుంబ పోషణ ఎంతో భారంగా మారింది. గిరిజన హాస్టల్‌లో, గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– తేజావత్ విజయ్, హాస్టల్ కార్మికుడు, మానుకోట

విగ్రహావిష్కరణకు తరలిరావాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న కమలాకర్ గౌడ్

నెహ్రూసెంటర్: ఈనెల 16వ తేదీన జరగనున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని గౌడ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గునిగంటి కమలాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం బండి దీపక్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్‌గౌడ్ మాట్లాడారు. బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా గౌడన్నలు ఏకం కావాలన్నారు. విగ్రహావిష్కరణకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ హాజరవుతున్నారని తెలిపారు. ద్విచక్రవాహన ర్యాలీ, సభ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు జెర్రిపోతుల వెంకన్న, ముత్యం వెంకన్న, పెద్ది వెంకన్న, బిక్కి వెంకటేశ్వర్లు, నలమాస సాయి, చిత్తనూరి శ్రీనివాస్, చిర్రయాకాంతం, గండి వీరేందర్ పాల్గొన్నారు.

తరతరాలకు స్ఫూర్తి పాపన్న గౌడ్

పెద్దవంగర: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర తరతరాలకు స్ఫూర్తి దాయకమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గునిగంటి మోహన్ గౌడ్ అన్నారు. అమరుల యాదిలో గీతన్న చైతన్య యాత్ర మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు అనపురం రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కణకు సంబంధించిన కరపత్రాలను బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, వెంకన్న గౌడ్, ప్రసాద్ గౌడ్, వీరన్న గౌడ్, సాయి కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోటాపై కేంద్రం కోత



ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

మహబూబాబాద్ రూరల్: యూరియా కోటాపై కేంద్ర ప్రభుత్వం కోత విధించటంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వీరన్న అన్నారు. రైతులకు యూరియా బస్తాలు ఇవ్వాలని మహబూబాబాద్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎదుట సీపీఐ, రైతు సంఘం ధర్నా ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ తిరుపతిరెడ్డి వచ్చి మూడు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో రైతులు కిషన్, సతీష్, సాలి, వీరన్న, బాలాజీ, వెంకన్న, సురేష్, భగవాన్, రాజేష్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన ఉద్యమంలో ఉద్యమకారులపై నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మీ, శ్రావణ్, శంకర్, పాల్, సత్యం పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తొర్రూరు: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. తొర్రూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన రిక్షా కార్మికుడు మంగళపెల్లి పెంటయ్య(60) అనే వ్యక్తి పట్టణంలోని ఓ ఇంట్లో జరిగిన ఫంక్షన్‌లో ఇంటిపై ఉన్న టెంట్‌ను తొలగిస్తుండగా కరెంట్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ

గార్ల: మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞను నిర్వహిచారు. కార్యక్రమలో వైస్ ప్రిన్సిపాల్ నాగూర్, రామ్మోహన్ రావు, చార్లీ, పున్నంచందర్, సుందరయ్య, రాజేష్, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



తొర్రూరు: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తొర్రూరు: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకే హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో బీజేపీ మండల పార్టీ అధ్వర్యంలో జాతీయా జెండాలను తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సాధించిన చారిత్రత్మకమైన విజయమని, ఇలాంటి ఘటనలను భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, నాయకులు పల్లె కుమార్, గట్టు రాంబాబు, గడల శేఖర్, నడిగడ్డ సందీప్ రాయపురం రాజ్‌కుమార్, జలగం రవి, సంతోష్, చలపతిరాజ్, జగదీప్ పాల్గొన్నారు.



కేసముద్రం: జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కేసముద్రం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. 100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి హోలం శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పాదిల నర్సింహరెడ్డి, జిల్లా కార్యదర్శి రాముడుగు వెంకటాచారి, బోగోజు నాగేశ్వరాచారి, గాంతి వెంకట్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు యూరియా బస్తాలు అందజేస్తాం

కురవి: మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంకు కర్షక సేవా సహకార సంఘం ఎదుట బుధవారం రైతులు యూరియా కోసం బారులుదీరారు. వర్షాలు భారీగా కురుస్తుండడంతో రైతులు యూరియా కోసం సొసైటీ కార్యాలయానికి వచ్చారు. ప్రతి రైతుకు రెండు యూరియా బస్తాలను అందజేస్తున్నట్లు సొసైటీ బాధ్యుడు జితేందర్ తెలిపారు.

వట్టివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి వట్టివాగుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం నిర్మాణ బాధ్యుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. బుధవారం అర్పనపల్లి గ్రామంలో గల వట్టివాగు వంతెనపై పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. లోలెవల్ వంతెన కారణంగా వర్షాకాలంలో వరద ఉధృతి పెరిగిన ప్రతిసారి, గూడూరు–కేసముద్రం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, బొబ్బాల యాకుబ్‌రెడ్డి, చాగంటి కిషన్, మోడెం వెంకటేశ్వర్లు, నర్సయ్య, జలేందర్, శ్రీశైలం, జయరాజ్, సావిత్ర పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక ధ్వంసం చేసిన పోలీసులు



నల్లబెల్లం, పటికను ధ్వంసం చేయిస్తున్న డీఎస్పీ, ఎక్సైజ్ సీఐ

మహబూబాబాద్ రూరల్/నెల్లికుదురు/దోర్నకల్: మహబూబాబాద్ పోలీస్ సబ్‌డివిజన్, మానుకోట, గూడూరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన నల్లబెల్లం, పటికను ధ్వంసం చేశామని డీఎస్పీ తిరుపతిరావు, ఎక్సైజ్ సీఐ చిరంజీవి అన్నారు. దాదాపు గత సంవత్సరం నుంచి నాటుసారా తయారీ కోసం రవాణా చేస్తూ పట్టుబడిన 500క్వింటాళ్ల నల్లబెల్లం, 50 క్వింటాళ్ల పటికను జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని మున్నేరువాగు ప్రవాహంలో పడవేసి ధ్వంసం చేశారన్నారు. అదేవిధంగా నెల్లికుదురులోని ఆకేరు వాగులో, బయ్యారం, డోర్నకల్ మండలాలలో ప్రవహిస్తున్న మున్నేరువాగులో నల్లబెల్లం, పటికను పారవేసి ధ్వంసం చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు సర్వయ్య, రాజేష్, రవికుమార్, ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: రైతులు ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులకు సమగ్ర రుణమాఫీ చట్టం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక వీరన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కుంట ఉపేందర్, ఏకేఎంఎస్ జిల్లా నాయకుడు సనప పొమ్మన్న అన్నారు. ఎస్‌కేఎం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై జిల్లా కేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతాంగానికి విద్యుత్ బిల్లులను మాఫీ చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలన్నారు. అటవీ హక్కుల చట్టం 2006 ను అమలు చేయాలని, అడవుల నరికివేత నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, నందగిరి వెంకటేశ్వర్లు, తండ సతీష్, ఎస్‌కే బాబు, హలావత్ లింగ్యా, రాజమౌళి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పల్లెప్రగతి యాత్ర

దోర్నకల్: సంక్షేమ పథకాల అమలుతో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాధారణ పొందుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని కస్నాతండాలో బుధవారం జరిగిన ఇందిరమ్మ పల్లె ప్రగతి యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లాలూనాయక్, తాళ్లూరి హనుమంతరావు, ఆంగోత్ వెంకన్న, మేకపోతుల శ్రీనివాస్‌యాదవ్, శంకర్‌నాయక్, కోటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాన్ని నియంత్రించాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాన్ని నియంత్రించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ సిందుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు తోట యాకయ్య, కనుకు, కదారి యాకయ్య, పవన్ పాల్గొన్నారు.

గండి పూడ్చించిన అధికారులు

తొర్రూరు రూరల్: మండలంలోని కంఠాయాపాలెం గ్రామంలోని పెద్ద చెరువు కట్టకు తూము సమీపంలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో దెబ్బతిని బుధవారం గండి పడింది. వెంటనే గ్రామస్తులు గమనించి సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన ఆర్‌డీఓ గణేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఈ సాయికిరణ్ ఘటన స్థలానికి చేరుకొని జేసీబీల సహాయంతో గండిని పూడ్చివేయించారు.

లియాఖత్ అలీ వర్ధంతి

కురవి: ఆశయం కోసం పనిచేసిన వ్యక్తులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ నాయకుడు ఎండీ లియాఖత్ అలీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, కరణం రాజన్న, వెంకన్న, సారయ్య, మహేష్ పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

నెల్లికుదురు: మండలంలోని వావిలాల గ్రామ పరిధిలోని నెల్లికుదురు మహబూబాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు పూడుకపోయింది. దీంతో స్పందించిన ఎస్సై చిర్ర రమేష్ బాబు బుధవారం ఎన్‌హెచ్‌ఏఐ వారి సహకారంతో రోడ్డును తవ్వించి వరదనీరు వెళ్లిపోవడానికి తాత్కాలిక మోరీలు వేయించి ఇబ్బందులు లేకుండా చేయించారు.

దుప్పుల పంపిణీ

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి ఎస్సీ కాలనీలో వేం చారిటబుల్ ట్రస్టు సహకారంతో పలువురికి దుప్పులు, టీషర్టులను మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొండ సురేష్ బుధవారం పంపిణీ చేశారు. వెంకన్న, యాదగిరి, సుమన్, పాపారావు పాల్గొన్నారు.

పల్లెపల్లెన బోనాల సందడి



కురవి: కొత్తూరులో బోనాలతో వెళ్తున్న మహిళలు



కురవి: కాంపల్లిలో బోనం ఎత్తుకున్న యువతీ



మరిపెడ రూరల్: వీరారంలో..



గార్ల మండలం రాంపురం గ్రామంలో..



మహబూబాబాద్ రూరల్: కొత్త బజార్ ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తులు



తొర్రూరు రూరల్: చెర్లపాలెంలో బోనం ఎత్తుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి



చిన్నగూడూరు: మండల కేంద్రంలో బోనాలతో వెళ్తున్న మహిళలు



పెద్దవంగరలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా ముత్యాలమ్మ బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దప్పుచప్పుళ్ల మధ్య మహిళలు ఊరేగింపుగా బోనాలతో గ్రామశివారులోని ముత్యాలమ్మ గుడికి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి బోనాలు చెల్లించారు. పాడి పంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గ్రామ దేవతను వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఘనంగా తీజ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న యువతులు

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో బుధవారం గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరినాయక్ మాట్లాడారు. లంబాడీల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ పండుగ ఎంతో పవిత్రమైందన్నారు. కార్యక్రమంలో ధరావత్ కైబాబు, బాల్యా, బుజ్జి, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.